క్లుప్తంగా

మూగ జీవాల సంక్షేమానికి కృషి చేయాలి



సుభాష్‌నగర్: మూగ జీవాల సంక్షేమానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం అదనపు కలెక్టర్ నేతృత్వంలో జిల్లా జంతు సంక్షేమ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జంతువుల సంరక్షణకు కమిటీ చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. జంతు ప్రేమికులు వాటి సంరక్షణ చర్యల కోసం జిల్లా కమిటీకి విరాళాలు అందించవచ్చని తెలిపారు. జంతు సంక్షేమ పక్షోత్సవాల సందర్భంగా ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి వ్యాసరచన పోటీల్లో నెగ్గిన విద్యార్థులకు, పశువైద్యాధికారులకు ప్రశంసా పత్రాలు, మెమొంటోలను బహూకరించారు. కార్యక్రమంలో జిల్లా పశు వైద్యాధికారి జగన్నాథ చారి, సహాయ సంచాలకులు బలీగ్ అహ్మద్, బసవ రెడ్డి పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

నిజామాబాద్ రూరల్: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ట్రెయినీ ఐఏఎస్ అధికారి కిరణ్మయి అన్నారు. మండలంలోని గుండారం, తిర్మన్‌పల్లి గ్రామాల్లో బుధవారం పర్యటించారు. గ్రామాల్లో తడి, పొడి చెత్త సేకరించే విధానంపై హర్షం వ్యక్తం చేశారు. గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాలను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం గ్రామాల్లో మహిళా స్వయం శక్తి సంఘాలతో సమావేశం నిర్వహించి రుణాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట డీఎల్‌పీవో శ్రీనివాస్, ఎంపీవో మధురిమ, గుండారం పంచాయతీ కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, ప్రియాంక, ఫీల్డ్ అసిస్టెంట్లు, కారోబార్‌లు, వనసేవకులు ఉన్నారు.

ఉన్నత శిఖరాలకు చేరాలి



బోధన్: క్రమశిక్షణ, పట్టుదలతో ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని బోధన్ ఎంఈవో నాగ్‌నాథ్, సాలూర తహసీల్దార్ రమేష్, ఎస్‌బీఐ మేనేజర్ హనుమంత్‌రావు విద్యార్థులకు సూచించారు. మంగళవారం సాలూర మండల కేంద్రంలోని ప్రజ్ఞశ్రీ హైస్కూల్ 24వ వార్షికోత్సవం, పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు వేడుకలను ఘనంగా నిర్వహించారు. చదువులో ప్రతిభ చాటిన విద్యార్థులకు అభినందించారు. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పాఠశాల కరస్పాండెంట్ లతా రాజు పాల్గొన్నారు.

టీకాలు వేయించాలి

ఆర్మూర్‌టౌన్: పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలను క్రమం తప్పకుండా వేసే విధంగా చూడాలని జిల్లా వ్యాధి నిరోధక అధికారి అశోక్ అన్నారు. మామిడిపల్లి ఆరోగ్య ఉపకేంద్రంలో వైద్య సిబ్బంది అందిస్తున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే నెల మార్చి 3 ,4 ,5 తేదీలలో జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

రుణాలను చెల్లించాలి

నవీపేట: బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను మహిళా సంఘాలు సకాలంలో చెల్లించాలని టీసెర్ప్ డీఆర్‌డీఏ ఏపీడీ రవీందర్ సూచించారు. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో బుధవారం జరిగిన మహిళా సమాఖ్య సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. తీసుకున్న రుణాలను ఆర్థిక ప్రగతికి వాడాలని, వడ్డీ వ్యాపారాలకు వాడుకోవద్దని సూచించారు. ఎంపీడీవో నాగనాథ్, ఐకేపీ ఏపీఎం భూమేశ్వర్‌గౌడ్, మహిళా సమాఖ్య మండల ప్రతినిధులు ఉషారాణి, నాగమణి, వినోద తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో ప్రతిభ

బాల్కొండ: మండల కేంద్రంలోని కృష్ణవేణి పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని రిషిత జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల్లో ద్వితీయ స్థానం సాధించిందని పాఠశాల ప్రిన్సిపాల్ విజయ్ తెలిపారు. జంతు సంరక్షణ, వాటి పరిరక్షణ అనే అంశంపై ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుందన్నారు. విద్యార్థినిని బుధవారం పాఠశాలలో అభినందించారు.

హెల్త్ సబ్ సెంటర్ తనిఖీ

డొంకేశ్వర్(ఆర్మూర్): మారంపల్లి హెల్త్ సబ్ సెంటర్‌ను డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేశ్ బుధవారం తనిఖీ చేశారు. సెంటర్‌లో జరుగుతున్న టీకాల కార్యక్రమాన్ని పర్యవేక్షణ చేసి రికార్డులను పరిశీలించారు. చిన్న పిల్లలకు అవసరమయ్యే టీకాలను క్రమం తప్పకుండా అందించాలని ఏఎన్ఎంలను, ఆశాలకు సూచించారు. అనంతరం నేషనల్ రూరల్ హెల్త్ మిషన్ కింద కొత్తగా నిర్మిస్తున్న సబ్ సెంటర్ భవనాన్ని, మండల కేంద్రంలోని పీహెచ్‌సీని పరిశీలించారు.

కష్టాల్లో కస్తూర్బా పాఠశాలలు

- ఆరు నెలలుగా నిలిచిపోయిన బిల్లుల చెల్లింపులు
- ఒక్కో పాఠశాలకు రూ.6 లక్షల నుంచి రూ.10లక్షల వరకు పెండింగ్‌లో బిల్లులు
- సామగ్రి సరఫరా చేయడానికి ముందుకు రాని కాంట్రాక్టర్లు
- విద్యార్థులకు భోజనం, అల్పాహారం అందించడానికి అవస్థలు పడుతున్న ప్రత్యేకాధికారులు



మోర్తాడ్‌లోని కస్తూర్బా పాఠశాల భవనం

మోర్తాడ్(బాల్కొండ): కస్తూర్బా పాఠశాలలను ఆర్థిక కష్టాలు వెంటాడుతున్నాయి. ఆరు నెలల నుంచి బిల్లుల చెల్లింపులు నిలిచిపోవడంతో పాఠశాలల ప్రత్యేకాధికారులు అవస్థలు పడుతున్నారు. బియ్యం మాత్రమే పౌర సరఫరాల శాఖ సరఫరా చేస్తుండగా కిరాణ సామగ్రి, కూరగాయలు, కోడిగుడ్లను కాంట్రాక్టర్లు సరఫరా చేయాల్సి ఉంది. గతంలో ఒక నెల బిల్లు మరుసటి నెలలో చెల్లించేవారు. బిల్లులు సొమ్ము చేతికి అందగానే కస్తూర్బా పాఠశాలల ప్రత్యేకాధికారులు కాంట్రాక్టర్లు సరఫరా చేసిన సామగ్రి మొత్తానికి డబ్బులు చెల్లించేవారు. జిల్లాలో 25 మండలాల్లో కస్తూర్బా పాఠశాలలు ఉన్నాయి. ఒక్కో పాఠశాలలో 200 నుంచి 350 మంది వరకు విద్యార్థులు ఉన్నారు. విద్యార్థుల సంఖ్యను బట్టి ఒక్కో పాఠశాలకు రూ.6లక్షల నుంచి రూ.10లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. సిలిండర్లు కొనుగోలు చేయడానికి ప్రతి నెలా తాము సొంతంగా డబ్బులను సమకూరుస్తున్నామని ప్రత్యేకాధికారులు చెబుతున్నారు. కిరాణ దుకాణాల్లో సామగ్రి ఉద్దెర ఇవ్వడానికి వ్యాపారులు ముందుకు రావడం లేదని ఫలితంగా అప్పులు చేయాల్సి వస్తుందని వారు వివరించారు. కూరగాయలు, కోడిగుడ్ల కాంట్రాక్టర్లు సామగ్రిని సరఫరా చేయబోమని చెబుతుండటంతో వారికి ఎంతో కొంత తమ చేతుల నుంచి ఇచ్చామని ప్రత్యేకాధికారులు వెల్లడించారు. 2023 సెప్టెంబర్‌లో బిల్లుల చెల్లింపు నిలిచిపోయింది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిధులను సకాలంలో విడుదల చేయకపోవడంతో ఇబ్బందికరమైన పరిస్థితి నెలకొందనే అభిప్రాయం వ్యక్తమైతుంది. పెండింగ్ బిల్లుల విషయంలో జిల్లాలోని కస్తూర్బా పాఠశాలల ప్రత్యేకాధికారులు కలిసి జిల్లా విద్యాశాఖ అధికారికి ఇటీవల వినతి పత్రం సమర్పించారు. ప్రభుత్వం నుంచి నిధుల విడుదల కాగానే బిల్లులు చెల్లిస్తామని అధికారులు చెబుతున్నారే తప్ప డబ్బుల చెల్లింపులు ఎప్పుడు అనే విషయంలో స్పష్టత ఇవ్వడంలేదు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం దయతో బిల్లులు మంజూరు చేయించాలని ప్రత్యేకాధికారులు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు విన్నవించాం

పెండింగ్ బిల్లుల విషయం గురించి ఉన్నతాధికారులకు విన్నవించాం. నిధులు విడుదల కాగానే బిల్లులు చెల్లిస్తామన్నారు. ఎప్పుడు డబ్బులు చేతికి అందుతాయో స్పష్టత లేదు. అందరం అప్పులు చేసి పాఠశాలల్లోని విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం.

– సంధ్యారాణి, కస్తూర్బా ప్రత్యేకాధికారిణి, ఏర్గట్ల

సీఎం చిత్రపటాలకు పాలాభిషేకం



మోస్రాలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



రుద్రూర్‌లో..

సాక్షి నెట్‌వర్క్: జిల్లాలో పలు చోట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు సీఎం రేవంత్ రెడ్డితో పాటు మంత్రుల చిత్రపటాలకు బుధవారం పాలాభిషేకం చేశారు. ఆరు గ్యారెంటీలలో భాగంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500 సిలిండర్ హామీలను నెరవెరుస్తూ ప్రభుత్వం జీవో జారీ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం



ఆర్మూర్‌లో తనిఖీ చేస్తున్న అధ్యాపకులు

సాక్షి నెట్‌వర్క్: జిల్లాలో ఇంటర్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి పరీక్షా కేంద్రాల్లోనికి అనుమతించారు. ఎలాంటి మాల్ ప్రాక్టీస్ జరగకుండా పరీక్షా కేంద్రం నిర్వాహకులు చర్యలు తీసుకున్నారు. ఆర్మూర్ మున్సిపరిధిలో 2,347 విద్యార్థులకు గాను 2,221 మంది, బాల్కొండ పరిధిలో 525 మంది విద్యార్థులకు గాను 509 విద్యార్థులు, వర్ని పరిధిలో 388 మంది విద్యార్థులకు గాను 367 మంది, రుద్రూర్ పరిధిలో 252 మందికి గాను 248 మంది విద్యార్థులు, మాక్లూర్ పరిధిలో 207 మంది విద్యార్థులకు గాను 202 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంది.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం



జెంటిల్ కిడ్స్ ప్లేస్కూల్లో ఆవిష్కరణలను ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు



ఎడపల్లి శ్రీమాధవి పాఠశాలలో ప్రదర్శనలను పరిశీలిస్తున్న మండల విద్యాధికారి రామారావు

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో బుధవారం సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు తాము రూపొందించిన నూతన ఆవిష్కరణలను ప్రదర్శించారు. మంచి ప్రయోగాత్మక ఆవిష్కరణలు చేసిన విద్యార్థులను విద్యాధికారులు అభినందించి బహుమతులు అందించారు. పలు చోట్ల సైన్స్ ఉపాధ్యాయులను సత్కరించారు.

ఆదర్శ వివాహం



బోధన్: పట్టణంలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన లింగడొల్ల చిన్న పర్వయ్య, బాలమణి దంపతుల కూతురు జ్యోతి, కోటగిరి మండలంలోని హంగర్గ (ఎం) గ్రామానికి చెందిన పుట్టి గణపతి, హనుమవ్వల కుమారుడు అనిల్‌ల ఆదర్శ వివాహం బుధవారం బోధన్‌లో జరిగింది. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో పెళ్లిని నిర్వహించారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య పెళ్లి పెద్దలుగా వ్యవహరించారు. సంప్రదాయాలకు భిన్నంగా వధూవరులు పూలదండులు మార్చుకుని పెళ్లి చేసుకున్నారు.

కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు



మాక్లూర్: అమ్రాద్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, రైస్‌మిల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ధన్‌కాంత్, మండల మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు రాస మురళీతో పాటు పలువురు బీఆర్‌ఎస్ కార్యకర్తలు బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆర్మూర్ నియోజక ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌రెడ్డి వారికి కండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీలోనికి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవి ప్రకాష్, కె పెద్దన్న, శ్రీనివాస్‌గౌడ్, రమేష్, అరీఫ్‌లు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



బాల్కొండ: మెండోరా మండలం కోడిచర్ల గ్రామానికి చెందిన ఓడెల గంగయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి పరామర్శించారు. రూ.పది వేల ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే మెండోరా మండల కేంద్రానికి చెందిన తోలక సాయన్న మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



మోర్తాడ్: దోన్‌పాల్‌లో సీసీ రోడ్డు నిర్మాణానికి ప్రత్యేకాధికారి, తహసీల్దార్ సత్యనారాయణ బుధవారం భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ విక్రమ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ముత్యాల రాములు, వైశ్రీ, కమ్మర్‌పల్లి గంగారెడ్డి, తీగెల సంతోష్, ఆనంద్, అశోక్, మహిపాల్, గంగానర్సయ్య, సాయి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దీకంపల్లిలో..

మాక్లూర్: దీకంపల్లిలో సీసీ రోడ్డు నిర్మాణానికి బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆలూర్ మండల అధ్యక్షుడు ముక్కెర విజయ్ భూమిపూజ చేశారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నుంచి రూ.8 లక్షల నిధులు మంజూరు కావటంతో గ్రామంలో పెండింగ్‌లో ఉన్న అంతర్గత రహదారులను సీసీ రోడ్డుగా మార్చేందుకుగాను స్థానిక పంచాయితీ కార్యదర్శితో ప్రణాళిక సిద్ధం చేయించి భూమి పూజ చేయించుకున్నారు. పంచాయితీ కార్యదర్శి దినేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కాలగడ్డ పొశెట్టి, పి ప్రవీణ్, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణలో ఈద్గాను మినహాయించాలి

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం చేపూర్ 63వ నెంబరు జాతీయ రహదారి విస్తరణలో రోడ్డు పక్కన గల ఈద్గా, శ్మశానవాటికను మినహాయించాలని చేపూర్ ముస్లిం కమిటీ నాయకులు అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్‌ను కోరారు. బుధవారం ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. కాంగ్రెస్ జిల్లా నాయకుడు సమీర్ అహ్మద్, టెలికాం డైరెక్టర్ షాహెద్, చేపూర్ మర్కజ్ కమిటీ అధ్యక్షుడు ఫర్జుల్లా ఖాన్, ఉపాధ్యక్షుడు కలీం, లాయక్ ఖాన్ పాల్గొన్నారు.

మున్సిపల్ అంచనా బడ్జెట్‌కు ఆమోదం



మాట్లాడుతున్న తూము పద్మాశరత్‌రెడ్డి

బోధన్: బోధన్ మున్సిపల్ 2024–25 ఆర్థిక సంవత్సరానికి రూ.23 కోట్ల 50 లక్షలతో రూపొందిన అంచనా బడ్జెట్‌ను ఆమోదించారు. బుధవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో చైర్‌పర్సన్ తూము పద్మాశరత్ రెడ్డి అధ్యక్షతన కౌన్సిలర్లు, అధికారులతో బడ్జెట్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో చైర్‌పర్సన్, కమిషనర్ వెంకట నారాయణ ముసాయి బడ్జెట్ పత్రాన్ని ప్రతిపాదించారు. ఆదాయ, వ్యయాలతో పాటు రూ.5 లక్షల మిగులును చూపించారు. 2024–25 సంవత్సరానికి గాను సాధారణ నిధుల అంచనా ఆదాయం రూ.14 కోట్ల 25 లక్షల 14 వేలు, ప్లాన్, నాన్‌ప్లాన్ నిధుల ఆదాయం రూ.8 కోట్ల 55 లక్షలు, ప్రభుత్వం ద్వారా సమకూరే డిపాజిట్, రుణాల ఆదాయం రూ.70 లక్షలు మొత్తం రూ.23 కోట్ల 50 లక్షల 14 వేలు ఉంటుందని ప్రతిపాదించారు. ఈ నిధుల వ్యయం రూ. 23 కోట్ల 45లక్షల 14 వేలు ఉంటుందని తెలిపారు. మున్సిపల్ కౌన్సిలర్లు, డీఈ శివానందం పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలలు సహకారం అందించాలి



పుష్పగుచ్ఛం అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మండలంలో ఇటీవల నూతనంగా ఎన్నికైన ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ సభ్యులు బుధవారం అంకాపూర్‌లో ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సామాజిక సేవా కార్యక్రమాలలో ప్రైవేట్ పాఠశాలలు చురుగ్గా పాల్గొని తమవంతు సహకారం అందించాలన్నారు. పిల్లలను విద్యావంతులుగా తయారు చేసి వారి అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. అధ్యక్ష, కార్యదర్శులు భారత్‌చంద్ర మల్లయ్య, విద్య ప్రవీణ్ పవార్, కోశాధికారి స్కాలర్స్ వేణు, కాంతి గంగారెడ్డి, మానస గణేష్, విద్య గోపీకృష్ణ, నలంద సాగర్, పోల్కం శ్రీనివాస్, లిల్లీపుట్ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

మాక్లూర్: అడవి మామిడిపల్లి శివారులోని గుత్ప చౌరస్తా వద్ద గల అపురూప వేంకటేశ్వర ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగా వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం వెంకటేశ్వర స్వాములవారిని గజవాహనం ఎక్కించి ఆలయ ప్రధాన అర్చకుడు కుమారస్వామి ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. భక్తులు వందలాదిగా తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్‌పర్సన్ అమృతలత, ప్రభదేవి, రాజారెడ్డి, రమాదేవి, నరేందర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

లక్ష్మీ గణపతి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

రుద్రూర్: శ్రీలక్ష్మీ గణపతి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి నిజామాబాద్ భజన బృందం ఆధ్వర్యంలో భజన కొనసాగింది. మూడు రోజుల పాటు అన్నదాన కార్యక్రమాన్ని వర్ని మండలం నెహ్రూనగర్ గ్రామానికి చెందిన శ్రీరాఘవేంద్ర సీడ్స్ యజమాని వట్టికూటి రవికుమార్ దాతగా నిలిచారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టాలి



మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి సుజాత

ఆర్మూర్‌టౌన్: దేశంలో మహిళలపై జరుగుతున్న హింసను ఆరికట్టాలని ఐద్వా జిల్లా కార్యదర్శి సుజాత అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని శాస్త్రినగర్ సీఐటీయూ కార్యాలయంలో సీపీఎం డివిజన్ కార్యదర్శి వెంకటేశ్ ఆధ్వర్యంలో బుధవారం ఐద్వా విస్తృ త స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్య, వైద్యం, ఉద్యోగం, నిత్యావసరాల ధరలు, పెట్రోల్, డీజిల్ గ్యాస్ ఇలా అనేక అంశాలపై మహిళలకు అవగాహన కల్పించి చైతన్యవంతులు చేయాలన్నారు. ప్రతి మండలంలో ప్రతి వార్డులలో ఐద్వా కమిటీలను ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నూతనంగా కమిటీలను ఎన్నుకున్నారు.

అక్బర్‌నగర్‌లో కాంగ్రెస్ జెండా ధ్వంసం

రుద్రూర్: అక్బర్‌నగర్ గ్రామంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు కాంగ్రెస్ పార్టీ జెండాను ధ్వంసం చేశారు. రాడ్‌ను విరగొట్టి జెండాను దూరంగా పడేశారు. బుధవారం ఉదయం ఇది గమనించిన కాంగ్రెస్ నాయకులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. దుండగులను గుర్తించి చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండల కేంద్రంలో బుధవారం బీజేపీ నాయకులు ప్రధాని నరేంద్ర మోదీ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. నిజామాబాద్ జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటు చేయడాన్ని హర్షిస్తూ బీజేపీ నాయకులు ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా ఎంపీ అర్వింద్ సమక్షంలో పాలాభిషేకం చేశారు. బీజేపీ ఆలూర్ మండల అధ్యక్షుడు గిరీష్, నాయకులు మల్లయ్య, హర్ష హరీష్, అరుణ్ పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలూ ముఖ్యమే

బాల్కొండ: చదువుతో పాటు క్రీడలు ముఖ్యమేనని కబడ్డీ అసోషియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు గంగాధర్ అన్నారు. బుధవారం ముప్కాల్ మండల కేంద్రంలో న్యూహరిజన్స్ పాఠశాలలో నిర్వహించిన స్పోర్ట్స్ మీట్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. ప్రిన్సిపాల్ చంద్ర విలాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐఐటీ గాంధీనగర్ శిక్షణకు ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు

కమ్మర్‌పల్లి: గుజరాత్ రాష్ట్రం గాంధీనగర్ ఐఐటీలో ఈనెల 28 నుంచి మార్చి 3 వరకు నిర్వహించే సెంటర్ ఫర్ క్రియేటివ్ లెర్నింగ్ నేషనల్ లెవల్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ శిక్షణ శిబిరానికి జిల్లాలోని పలువురు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. సీహెచ్.ముద్దుకృష్ణ(దుబ్బ పాఠశాల), శ్రీపాద్(గుండారం జెడ్పీహెచ్ఎస్), జి.రాజశేఖర్(ఏర్గట్ల జెడ్పీహెచ్ఎస్)ఎంపికయ్యారు. ఈ శిక్షణ శిబిరంలో సామర్థ్య నిర్మాణ వర్క్‌షాప్‌లతో అవగాహన కల్పిస్తారు. ఈ జాతీయ స్థాయి శిక్షణా కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్రం నుంచి 100 మంది ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు ఎంపికైనట్లు డీఈవో దుర్గాప్రసాద్ తెలిపారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	క్రాక్-జీతేగా తో జీయేగా (హిందీ) - 10.10, 3.40, 9.45 తప్పించుకు తిరుగువాడు ధన్యుడు సుమతి (తెలుగు) - 1.30 సుందరం మాస్టర్ (తెలుగు) - 7.01
స్క్రీన్-2 –	భ్రమ యుగం (తెలుగు) - 12.00, 9.10 సిద్ధార్థరాయ్ (తెలుగు)-3.00 ఊరు పేరు భైరవ కోన(తెలుగు) - 6.10
స్క్రీన్-3 –	ఆర్టికల్-370 (హిందీ) - 1.00, 7.10, 10.35 సుందరం మాస్టర్ (తెలుగు) - 4.25
స్క్రీన్-4 –	ముఖ్యగమనిక (తెలుగు) - 1.05 మస్తు షేడ్స్ ఉన్నాయ్ రా - 1.50, హనుమాన్ (తెలుగు)-6.50 సుందరం మాస్టర్ (తెలుగు) - 10.10

సంక్షిప్తం

వ్యవసాయ ఎగుమతులపై నియంత్రణ సరికాదు

పెర్కిట్(ఆర్మూర్): వ్యవసాయ ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటున్న దేశాలు 10 నుంచి 40 శాతం మాత్రమే అనుమతిస్తే భారత దేశం రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆర్మూర్ పట్టణానికి చెందిన పసుపు రైతు సంఘం నాయకుడు నర్సింహ నాయుడు అబుదాబి దేశంలో నిర్వహించిన డబ్ల్యూటీవో సమావేశం దృష్టికి తీసుకెళ్లారు. సమావేశంలో ఎగుమతులపై జరుగుతున్న చర్చలో నర్సింహ నాయుడు పాల్గొని ఎగుమతులపై ఆంక్షల వల్ల కలిగే నష్టాలను వివరించారు.

ఈటల రాజేందర్‌కు ముదిరాజ్‌ల సన్మానం

రెంజల్(బోధన్): బీజేపీ నేత ఈటల రాజేందర్‌ను రెంజల్‌కు చెందిన ముదిరాజ్ కులస్తులు ఘనంగా సన్మానించారు. సాటాపూర్‌లో విజయ సంకల్పయాత్ర ప్రచార రథం నుంచి కిందికి దిగి రావడంతో రెంజల్ గ్రామ ముదిరాజ్ కులపెద్దలు పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. కళ్యాపూర్ నుంచి సాటాపూర్ వరకు భారీ బైక్‌ర్యాలీ నిర్వహించి బీజేపీకి, మోదీకి అనుకూలంగా నినాదాలు చేశారు.

ఉచిత యోగా యాత్ర

రుద్రూర్: నల్గొండలోని ఆర్యసమాజ్‌లో వచ్చే నెల 2న నిర్వహించే స్వామి దయానంద సరస్వతి 200వ జయంతి ఉత్సవాలకు స్వామి రామ్‌దేవ్ మహరాజ్ ముఖ్య అతిథిగా వస్తున్నట్లు పతంజలి రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ మహజన్ విశ్వనాథ్ తెలిపారు. నల్గొండ ఆర్య సమాజ్ ప్రారంభమై వంద ఏళ్లు పూర్తయిన సందర్భంగా స్వామి దయానంద సరస్వతి జయంతి ఉత్సవాలు జరుపుతున్నారని పేర్కొన్నారు. ఈ సభలో మానవ జీవనంలో యోగా ప్రాధాన్యత, భారతీయ విద్యా విధానంపై స్వామి రామ్‌దేవ్ మహరాజ్ ప్రవచనాలు ఉంటాయని వివరించారు. ఇంగ్లీష్, గణితం సైన్స్, టెక్నాలజీ గురించి కూడా వివరిస్తారని వెల్లడించారు. ఈ కార్యక్రమానికి హజరయ్యే పతంజలి సభ్యుల కోసం బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వివరాలకు 99494 89697, 77804 23339.

నేడు బాన్సువాడలో జాబ్‌మేళా

బాన్సువాడ రూరల్ : మండలంలోని శ్రీరాం నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీకళాశాలలో గురువారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర ఇందూరు గంగాధర్ తెలిపారు. యాక్సిస్ బ్యాంక్, ప్రో మైండ్స్ స్కిల్ క్యాటలిస్టుల సంయుక్త ఆధ్వర్యంలో జాబ్‌మేళా ఉంటుందన్నారు. డిజిటల్ ఆఫీసర్, కస్టమర్ సేల్స్ అడ్వైజర్స్, టీఎల్ పోజిషన్ ఉద్యోగాలకు డిగ్రీ ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. వివరాలకు 99481 77361లో సంప్రదించాలన్నారు.

తైబజార్ వేలం వాయిదా

బోధన్: మున్సిపల్ 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను తైబజార్, పశువధశాల వేలం గురువారం జరగాల్సి ఉండగా, అనివార్య కారణాల వల్ల వాయిదా వేశామని మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ బుధవారం తెలిపారు. తిరిగి మార్చి 5న ఉదయం 11 గంటలకు వేలం పాట నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ఘనంగా టైలర్స్ డే

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని మేరు సంఘం ఆధ్వర్యంలో ఘనంగా టైలర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా దర్జీల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ప్లకార్డులను పట్టుకొని ర్యాలీ తీశారు. అనంతరం మేరు సంఘంలో దర్జీలను ఘనంగా సన్మానించారు. మేరు సంఘం అధ్యక్షుడు రవీంద్రనాథ్, ప్రధాన కార్యదర్శి కొండ లక్ష్మణ్‌పాల్గొన్నారు.